క్లుప్తంగా

సీఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం



మంగళగిరి: పట్టణ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా మద్దెడు శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు చేపట్టిన మల్లిఖార్జునరావు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నియమితుడైన శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. కొత్త సీఐకు ఎస్ఐలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

భావనాఋషి కల్యాణ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ



మంగళగిరి: పట్టణంలోని పాత మంగళగిరి పద్మశాలీయ కల్యాణ మండపంలో గురువారం శ్రీ భద్రావతి సమేత భావనాఋషి స్వామి వారి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలు, క్యాలెండర్లను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఇన్‌చార్జి గంజి చిరంజీవిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావనాఋషి స్వామి కల్యాణ మహోత్సవాన్ని పద్మశాలీయ బహుత్తమ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నందం అబద్దయ్య, జనసేన నాయకుడు చిల్లపల్లి శ్రీనివాసరావు, సంఘం ప్రతినిధులు మునగపాటి మారుతీరావు, జొన్నాదుల వరప్రసాద్, వూట్ల సాంబశివరావు, ఎం వెంకటేశ్వరరావు, వూట్ల వెంకట సాంబశివరావు, వూట్ల శ్రీమన్నారాయణ, పాల శ్రీనివాస్, డి బాబూరావు, రావెల శివసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై సమావేశం

మంగళగిరి: ఎస్సీ వర్గీకరణ బిల్లు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో వర్గీకరణ అంశం పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. పట్టణంలోని పెన్నర్స్ అసోషియేషన్ కార్యాలయంలో గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీలపై సమీక్ష నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో సుప్రీంకోర్టులో ప్రభుత్వం న్యాయవాదిని నియమించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని కౌలురైతు మృతి

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో లారీ ఢీకొని కౌలు రైతు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గురువారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెదకాకాని మండలం నంబూరుకు చెందిన అప్పారావు పెదవడ్లపూడిలో పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం పొలం పని ముగించుకొని పెదవడ్లపూడి సెంటర్‌కు అప్పారావు దంపతులు చేరుకున్నారు. అప్పారావు రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఢీకొట్టిన లారీ డ్రైవర్ లారీ ఆపకుండా పరారయ్యేందుకు యత్నించగా స్థానికులు వెంటపడి కోకాకోలా కంపెనీ వద్ద లారీని ఆపి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాద వివరాలు సేకరించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

మహిళపై కొడవలితో దాడి

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): పాత గొడవల నేపథ్యంలో పొలం నుంచి ఇంటికి వస్తున్న మహిళపై అదే గ్రామానికి చెందిన మరో మహిళ, తన భర్తతో కలసి దాడి చేసి గాయపరిచిన సంఘటన గురువారం జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గోరంట్ల అప్పమ్మ, దిగళ నారాయణమ్మ కుటుంబాల మధ్య గతంలో వివాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలో పాత గొడవలు మనసులో పెట్టుకొని పొలం నుంచి గడ్డికోసుకొని ఇంటికి వస్తున్న గోరంట్ల అప్పమ్మ పై దిగళ నారాయణమ్మ, ఆమె భర్త వెంకట లక్ష్మణరాజులు కలసి కొడవలి, గొడ్డలి కర్రలతో ఒక్కసారిగా దాడి చేశారు. ఈ దాడిలో అప్పమ్మ తల, చేతులపైన తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.కిశోర్‌బాబు తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం

- కార్పొరేషన్ కమిషనర్ వి నిర్మల్‌కుమార్
- పట్టణంలో ఘనంగా ఓటరు దినోత్సవం
- సీనియర్ ఓటర్లకు సన్మానం

మంగళగిరి: ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకుని తమ ఓటును సద్వినియోగ పరచుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ వి నిర్మల్‌కుమార్ పిలుపునిచ్చారు. 14 వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలో 80 సంవత్సరాల వయస్సుపై బడిన ఓటర్లను సత్కరించారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించి పురవీధుల్లో నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఓటు హక్కు ద్వారా ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థను తీర్చిదిద్దుకోవడం ఓటరు చేతిలోనే ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హేమామాలిని, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.



సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న అధికారులు



ఓటరు దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ నిర్మల్ కుమార్

ఓటు పట్ల అవగాహన కలిగి ఉండాలి

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటును నమోదు చేసుకోవాలని, ఓటు పట్ల అంతా అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ కొత్త గిరిధరరావు విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి రాంబాబు, వైస్ ప్రిన్సిపల్ వై. పూర్ణచంద్రరావు, అధ్యాపకులు సరళాదేవి, విజయకృష్ణ, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన పెంచుకోండి

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం మండల పరిషత్ పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణమూర్తి పాల్గొని విద్యార్థులకు ఓటు హక్కువలన ఉపయోగాలు, ఓటును ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై వివరించారు. అనంతరం ఓటు హక్కును వినియోగించుకుంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పద్మావతి, భారతి, గోపి, శేషరవి, హెచ్‌ఎం దివి, కమల్‌మోహన్, ఓటర్లు సుబ్బారెడ్డి, మరియమ్మ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కళాశాల విద్యార్థులు

ఓటరు నమోదుపై అవగాహన

మేడికొండూరు: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహసీల్దారు కార్యాలయంలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. తహసీల్దారు శ్రీనివాసశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓటు హక్కు ప్రాముఖ్యత, పలు రకాల అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పలువురు సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్న, ఎంపీడీవో ప్రభాకరరావు, డెప్యూటీ తహసీల్దారు కె.శ్రీనివాసరావు, ఎంఈఓ ఏసురత్నం, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయప్రద, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

యువ ఓటర్లపైనే దేశ భవిష్యత్తు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

తాడేపల్లి రూరల్: దేశ భవిష్యత్తు యువ ఓటర్లపైనే ఆధారపడి ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కెఎల్ యూనివర్శిటీలో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న దగ్గుపాటి పురందేశ్వరి మాట్లాడుతూ యువత దేశం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆలోచించి మంచి నాయకులను తమ ఓటు ద్వారా ఎన్నుకోవాలని సూచించారు. యువత ఓటు హక్కు రాబోయే ఎన్నికల్లో దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. యువతకు జాతీయ భావాలు ముఖ్యమని అన్నారు. స్వామీ వివేకానంద ప్రసంగాలతో యువత స్ఫూర్తిని పొందాలని సూచించారు. తదుపరి యూనివర్శిటీలో ఇంక్యుబిలేటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణ మాట్లాడుతూ యువత స్టార్టప్ ఇండియాకు దిక్సూచి కావాలని అన్నారు. అనంతరం పురందేశ్వరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ హనుమంతరావు, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాజీ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, బీజేవైఎం నాయకులు మాధవ్, చైతన్య శర్మ, డాక్టర్ అభిరుచి మధు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న పురందేశ్వరి

ఓటరు జాబితాపై అవగాహన సదస్సు

హాజరైన ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లక్ష్మి కుమారి

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో ఓటర్ల తుది జాబితాను ఇప్పటికే విడుదల చేశామని ఆ జాబితాలో ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే చేయించుకోవచ్చని మంగళగిరి మంగళగిరి ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లక్ష్మీ కుమారి గురువారం తెలిపారు. తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఓటర్ల జాబితాపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతి మంగళవారం గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల వారికి నూతనంగా చేర్చిన ఓట్లు, తొలగించిన ఓట్లు, సరిచేసిన ఓట్లు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ అయిన ఓట్ల జాబితాను లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ ఓటరు జాబితాను తయారు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఎవరైనా మృతి చెందినట్లయితే ఓటును తొలగించుకోవాలని, ప్రతి ఓటరు ఎన్నికల అధికారికి సహకరించాలని కోరారు. అనంతరం ఓట్ల నమోదుపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.



ఓటు నమోదుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న లక్ష్మీ కుమారి

ఘనంగా ఓటరు దినోత్సవం

మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో మంగళగిరి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లక్ష్మి కుమారి ఆధ్వర్యంలో గురువారం ఓటరు దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కుపై అవగాహన, ఓటు హక్కు ప్రాధాన్యత గురించి వివరిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటు హక్కు విలువ, ప్రాధాన్యతపై అవగాహన కల్పించి, బూత్ లెవల్ అధికారులు ఇతర ఎన్నికల అధికారులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిని వివరిస్తూ..సమస్యలు పరిష్కరిస్తూ..

- ఉత్సాహంగా కొనసాగుతున్న గుడ్‌మార్నింగ్ మంగళగిరి
- ప్రజలతో మమేకమవుతున్న ఇన్‌చార్జి గంజి చిరంజీవి

మంగళగిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు సంవత్సరాలలో జరిగిన అభివృద్ధిని వివరించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నగరంలో గుడ్ మార్నింగ్ కార్యక్రమం కొనసాగుతుంది. గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి మంగళగిరి ఏడవ వార్డు ఏపీఎస్పీ బెటాలియన్(సర్దార్ వల్లభాయ్ పటేల్ రోడ్డు) నుంచి గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఇళ్లకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా గుడ్‌మార్నింగ్ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఇళ్లు లేని వారికి స్థలాలు కెటాయించి పట్టాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బెజ్జం రాజాజీ, పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, పచ్చల శ్యాంబాబు, తోట శ్రీను, మాలిక్‌బాబు, బేతపూడి నరసయ్య, వల్లంశెట్టి విజయ్, వ్యాసం అజయ్, చింకా మహేష్, సురేష్, వందనం తదితరులు పాల్గొన్నారు.



7వ వార్డులో స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న చిరంజీవి

కబడ్డీ పోటీల్లో మేడికొండూరు జట్టు విజేత



మేడికొండూరు : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో మేడికొండూరు మండలం సిరిపురం బాలికల జట్టు విజయం సాధించింది. తాడికొండ నియోజకవర్గంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మహిళా విభాగంలో మేడికొండూరు మండలం తమ సత్తా చాటారు. ఫైనల్ మ్యాచ్‌లో తుళ్లూరు మహిళా జట్టుపై జరిగిన పోటీలో మేడికొండూరు మండలం క్రీడాకారులు సత్తా చాటి విజయం సాధించారు.

పారా లీగల్ వలంటీర్‌ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

మంగళగిరి: పట్టణంలోని కోర్టులో పారా లీగల్ వలంటీర్‌ల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి వై నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారితో పాటు ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, లా విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఫిబ్రవరి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కోర్టు ఆవరణలోని ఎంఎల్ఎస్‌సి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు కేంద్రం వ్యతిరేక విధానాలపై ర్యాలీ

తాడేపల్లిరూరల్ : బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నేడు తాడేపల్లి మండలంలో జరిగే ట్రాక్టర్, బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు, ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షుడు మోదుగుల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. నరేంద్రమోడీ నాయకత్వాన కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా రైతాంగాన్ని, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించకుండా నట్టేట ముంచిందని అన్నారు. రైతుల రుణాల మాఫీ, రుణ ఉపశమన చట్టాన్ని ప్రవేశపెట్టాలని, ఉపాధి హామీకి బడ్జెట్ కేటాయించి పని రోజులు వేతనాన్ని పెంచి ఉపాధి కూలీలను ఆదుకోవాలనే డిమాండ్లతో జరిగే ర్యాలీ కుంచనపల్లి ప్రాతూరు క్రాస్‌రోడ్ నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమౌతుందని చెప్పారు. ఈ ర్యాలీలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఓటును సక్రమంగా వినియోగించుకోండి

తాడికొండ: ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో మంచి పాలకులను ఎన్నుకోవచ్చని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి ఎ రవీంద్ర బాబు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడికొండ శ్రీ సత్యసాయి కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేయించుకొని ప్రజాస్వామ్యయుతంగా జరిగే ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోహినీ కుమారి, డిప్యూటీ తహసీల్దార్ కాకు మాను ప్రసాద్, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎస్‌ఎంఎస్ లత, రాధా కుమారి, పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో మొక్కజొన్న, జొన్న పంటలను జిల్లా వనరుల వ్యవసాయ అధికారిణి ఎం.హైమావతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. పంట తెగుళ్లకు వినియోగించవలసిన మందులపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. శిరీష, గ్రామ వ్యవసాయ అధికారి శ్రీవిద్య, రైతులు సీతారామయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాలపై అవగాహన ర్యాలీ

పాల్గొన్న ఆక్టోపస్ ఎస్పీ రవిచంద్ర

మంగళగిరి: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలను నివారించాలని ఆక్టోపస్ ఎస్పీ రవిచంద్ర అన్నారు. 35 వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా గురువారం పట్టణంలోని గౌతమబుద్దా రోడ్డు లో ప్రమాదాల నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం అంటే ఒక మనిషి మృతి చెందడం కాదని అతని మృతి వలన ఒక కుటుంబం అనాథగా మారుతుందని తెలుసుకోవాలన్నారు. మద్యపానం సేవించి వాహనాలు నడుపుతున్న కారణంగానే అధిక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రజల రక్షణ కోసమే రహదారి నిబంధనలు అమలు చేస్తున్నామన్నారు. రహదారి నిబంధనలపై ప్రజలు అవగాహన కలిగి ఉండి వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీటీసీ కరీం, ట్రైనీ ఆర్టీవోలు మనోహర్, భరత్, ఎస్ గోపాల్, మంగళగిరి, తెనాలి ఎంఈఐలు వి విజయసారధి, రాఘవ, మల్లీశ్వరి, తోట రాఘవరావు, జి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న పోలీసు అధికారులు

శాస్త్ర సాంకేతిక అభివృద్ధితోనే పురోగతి

సీఎస్ఐఆర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ గిరీష్ సాహ్నీ

మంగళగిరి: సైన్స్ అండ్ టెక్నాలజీ లేనిదే ఏ దేశమైనా అభివృద్ధి చెందలేదని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సిఎస్ఐఆర్) మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గిరీష్ సాహ్నీ పేర్కొన్నారు. మండలంలోని నీరుకొండ గ్రామంలో ఎస్ఆర్ఎం యూనివర్శిటిలో గురువారం జరిగిన కార్యక్రమానికి హాజరైన గిరీష్ సాహ్నీ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల పరిశోధనలకు భారతదేశం తగిన ప్రాధాన్యతనిస్తుందన్నారు. యువ పరిశోధకులు, రీసెర్చ్ స్కాలర్లు కొత్త ఆలోచనలకు పదును పెట్టి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. నూతన సృజనల దిశగా అడుగులు వేసేందుకు మార్గాలను అన్వేషించుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనివర్శిటి వీసీ డాక్టర్ మనోజ్ కుమార్ అరోరా సలహాదారుడు వజ్జా సాంబశివరావు, ప్రొఫెసర్ డి నారాయణరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కల్లూరి వినాయక్, డీన్‌లు డాక్టర్ రంజిత్ థాపా,డాక్టర్ సుదర్శన్ గోవిందరాజన్, రాజ పాండియన్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ గిరీష్ సాహ్నీని సత్కరిస్తున్న వీసీ, తదితరులు

29 నుంచి వేంకటేశ్వర వైభవోత్సవాలు

తెనాలిటౌన్: కొత్త పేటలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు గోవిందనామ జపయజ్ఞ పూర్ణాహుతి, వేంకటేశ్వర సప్తాహ వైభవోత్సవాలు నిర్వహించనున్నట్లు బాలస్వామీజీ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను గురువారం గ్రౌండ్ ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. సాలిగ్రామ మఠం ట్రస్ట్, శ్రీవిద్యా పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాల స్వామీజీ మాట్లాడుతూ తిరుమలలో శ్రీవారికి సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు ఏ విధంగా పూజా కార్యక్రమాలు జరుగుతాయో.. అదేవిధంగా ఏడు రోజులు వైభోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం శృంగేరి శారదా పీఠ ఆస్థాన పండితులు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్‌శాస్త్రి వేంకటేశ్వర వైభవ సప్తాహ ప్రవచనం ఉంటుందని తెలిపారు. మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ సాయి హరేరామ్, ఎం.రమణయ్య, కోన నాగేశ్వరరావు, రావూరి సుబ్బారావు, మానేపల్లి శివ, వుప్పల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బాల స్వామీజీ

ఎన్‌వీఆర్ కళాశాలలో కంటి వైద్య శిబిరం

తెనాలిఅర్బన్: ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని గురువారం కళాశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడలోని సంధ్యా హస్పిటల్ వైద్యులు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేయనుననట్లు కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అజయ్, వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్ర, కో–ఆర్డినేటర్ నాగార్జున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి, చండీ హోమాలు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో పుష్య పౌర్ణమి సందర్భంగా భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలను రుత్వికులు వేదమంత్రాలతో విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతిలో ఆలయ పాలకమండలి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తెనాలి డిపో పరిధిలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం

తెనాలిరూరల్: తెనాలి ఆర్టీసీ డిపో పరిధిలో గత రెండేళ్లలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని, జీరో యాక్సిడెంట్‌గా తెనాలి డిపోకు పేరు తీసుకురావాలని ఆర్టీసీ డ్రైవర్లకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా తెనాలి డిపోలోని డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందితో ఎంవీఐ గురువారం డిపో మేనేజర్ రాజశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు సిగ్నల్స్‌ను గమనిస్తూ..బస్సులు నడపాలని చెప్పారు. బ్రేక్‌డౌన్ లేకుండా వాహనాలను ఎప్పటికప్పుడు సర్వీస్ చేయాలని మెకానిక్‌లకు సూచించారు. మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ డ్రైవర్లు డ్యూటీ సమయానికి అర్ధగంట ముందు వచ్చి వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేసుకోవాలన్నారు.

అలరించిన రామదాసు కీర్తనలు



తెనాలిటౌన్: పట్టణంలోని తులసీరామ్ చౌక్‌లో ఉన్న సీతా రామమందిరంలో గురువారం వి.లక్ష్మీసునీత ఆధ్వర్యంలో మహిళలు, భక్తులు రామదాసు కీర్తనలు ఆలపించారు. కొద్ది రోజులుగా భద్రాచలం శ్రీరాముని నవరత్న, రామదాసు కీర్తనలను శిష్య బృందం సభ్యులు ఆలపిస్తున్నట్లు సునీత తెలిపారు. ప్రతి నెలా శ్రీరాముని జన్మ నక్షత్రం రోజున సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.